క్లుప్తంగా

ఆస్తిపన్ను బకాయి వడ్డీపై 90 శాతం రాయితీ

బడంగ్‌పేట్: 2022–23 సంవత్సరానికి గాను ఆస్తిపన్ను బకాయి వడ్డీపై 90శాతం వడ్డీ రాయితీని కల్పిస్తున్నట్లు బడంగ్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రఘు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం 10 శాతం వడ్డీతో పేరుకుపోయిన ఆస్తి బకాయిలు చెల్లించే అవకాశం ప్రభుత్వం కల్పించిందని తెలిపారు. ఈ అవకాశాన్ని పట్టణ, గృహ, వాణిజ్య పన్నుల వినియోగదారులు సద్వినియోగం చేసుకుని 31 మార్చి 2024 గడువులోగా బకాయి ఆస్తి పన్నులు చెల్లించాలని కోరారు.

బీఆర్ఎస్ 28వ డివిజన్ అధ్యక్షుడిగా బలరామకృష్ణ



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సబిత

మీర్‌పేట: బీఆర్ఎస్ పార్టీ మీర్‌పేట కార్పొరేషన్ 28వ డివిజన్ అధ్యక్షుడిగా నారిని బలరామకృష్ణను నియమిస్తూ మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. డివిజన్‌లో పార్టీని బలోపేతం చేయడంతో పాటు అందరిని కలుపుకుని పోవాలని సూచించారు. తనపై నమ్మకం ఉంచి పదవి అప్పగించిన ఎమ్మెల్యే, పార్టీ పెద్దలకు బలరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు కామేష్‌రెడ్డి, నాయకులు దీప్‌లాల్ చౌహాన్, రాజ్‌కుమార్, రాజు, నాగరాజు, వీరరాఘవరెడ్డి, లక్ష్మీసంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

రేషన్ దుకాణం మంజూరు చేయండి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలో పెరిగిన జనాభా ప్రకారం కొత్త రేషన్ దుకాణాలు మంజూరు చేయాలని కోరుతూ.. గురువారం శ్రీహిల్స్ కాలనీకి చెందిన పలువురు కార్డు హోల్డర్లు జిల్లా కలెక్టర్, ఆర్డీఓకు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బహుగుణ మాట్లాడుతూ.. అల్మాస్‌గూడ ఓల్డ్ విలేజ్‌లో రెండు రేషన్ దుకాణాలు ఉన్నాయి. కాని, రేషన్ తీసుకోవాలంటే నాలుగు కిలోమీటర్లు నడిచి రావాల్సి వస్తుంది. జనాభా పెరిగి ఇళ్లు, కాలనీల సంఖ్య పెరగడంతో లబ్ధిదారులు సంఖ్య పెరిగింది. దీంతో రేషన్ ఇచ్చే సమయంలో అతిపెద్ద లైన్ ఏర్పడి గంటల తరబడి రేషన్ కోసం నిలబడాల్సిన పరిస్థితి. అంతదూరం నడిచి రేషన్ తీసుకుని, మోసుకొని రావడం కష్టంగా మారిందని కాలనీకి చెందిన మహిళలు వాపోతున్నారు. పెరిగిన కాలనీల సంఖ్యను పరిగణలోకి తీసుకుని కొత్త దుకాణాలు మంజూరు చేయాలని కోరారు.

చిన్నారెడ్డికి శుభాకాంక్షలు



చిన్నారెడ్డిని సన్మానిస్తున్న జంగారెడ్డి

కందుకూరు: రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన చిన్నారెడ్డిని గురువారం గాంధీభవన్‌లో పీసీసీ ప్రచార కమిటీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి కలిసి సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఆయనతో పాటు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



సమీక్ష చేస్తున్న ఎంపీడీఓ తదితరులు

కందుకూరు: ఎండాకాలంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ సరిత ఆదేశించారు. గురువారం తన ఛాంబర్‌లో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ జగన్మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నీటి సరఫరా చేసే పైపులైన్లకు లీకేజీలు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేయించాలని సూచించారు. తాగునీటికి ఎవరూ అవస్థలు పడొద్దన్నారు. సరఫరా సవ్యంగా జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రిడ్ ఏఈ అరుణ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటకు వేళాయెె!

క్రీడలపై ఆసక్తి ఉన్న విద్యార్థులు, యువకులు వేసవి సెలవుల్లో ఆయా క్రీడల్లో శిక్షణ పొంది.. సత్తా చాటాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. అందుకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిలుస్తోంది.. ఇక్కడ శిక్షణ పొందిన వారు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించారని స్టేడియం నిర్వాహకులు సూచిస్తున్నారు.

- వేసవి సెలవుల్లో శిక్షణకు సన్నద్ధం
- సరూర్‌నగర్ స్టేడియంలో ఏర్పాట్లు



సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

హుడాకాంప్లెక్స్: పాఠశాలలు, కాలేజీలకు మరి కొద్ది రోజుల్లో వేసవి సెలవులు ప్రారంభం కానున్నాయి. సెలవుల్లో విద్యార్థులు ఖాళీగా ఉండి, ఇంట్లో టీవీలకు, ఫోన్‌లకు అతుక్కుపోకుండా ప్రత్యేక అంశాల్లో శిక్షణ ఇప్పించాలని తల్లిదండ్రులు భావిస్తున్నారు. కొంతమంది సంగీతం, నృత్యం, చిత్రలేఖనం వంటి అంశాల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తుండగా, మరి కొంత మంది ఇంగ్లిష్, హిందీ, ఫ్రెంచ్ భాషల్లో శిక్షణ ఇప్పించాలని భావిస్తున్నారు. మరికొంతమంది వివిధ క్రీడాంశాలను ఎంచుకుంటున్నారు. ఇలాంటి ఔత్సాహికులకు సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిలుస్తోంది. ప్రతి ఏడాదిలాగే, ఈసారి కూడా ప్రత్యేక అంశాల్లో శిక్షణ ఇచ్చి విద్యార్థులను ఆ దిశగా ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఈ మేరకు అవసరమైన ఏర్పాట్లు కూడా చేస్తున్నారు. తద్వారా పిల్లలకు చదువుతో పాటు మానసిక వికాసానికి, శారీరక దృఢత్వానికి, ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలని భావిస్తున్నారు. ఇప్పటికే స్టేడియం వేదికగా పలు అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన వారు జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని తమ సత్తాను చాటుకుంటున్నారు. తల్లిదండ్రులకు, శిక్షణ ఇచ్చిన గురువులకు ఎనలేని గుర్తింపు తెచ్చిపెడుతున్నారు. ముఖ్యంగా స్కేటింగ్, అథ్లెటిక్స్, క్రికెట్, హాకీ, హ్యాండ్బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, జిమ్నాస్టిక్స్, టెన్నిస్, ఖోఖో, స్విమ్మింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తూ బంగారు భవిష్యత్తుకు బాటలు వేస్తున్నారు. నిత్యం ఈ స్టేడియంలో 2500 మంది క్రీడాకారులు శిక్షణ తీసుకుంటున్నారు. వేసవి సెలవుల్లో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం లేక పోలేదు.. ఆ మేరకు స్పోర్ట్స్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్రీడాకారుల నిష్పత్తిని బట్టి బ్యాచ్‌లను ఏర్పాటు చేస్తున్నారు.



కరాటే ప్రాక్టీస్ చేస్తున్న క్రీడాకారిణి



జిమ్నాస్టిక్స్ ప్రాక్టీసు చేస్తున్న క్రీడాకారిణి

సరూర్‌నగర్ స్టేడియంలో వివిధ అంశాల్లో ఇచ్చే శిక్షణ వివరాలు

క్రీడాంశం	కోచ్ పేరు	ఫోన్ నెం:
జిమ్నాస్టిక్స్	స్వర్ణలత	8148450218
బ్యాడ్మింటన్	ఫణికిషోర్	9866095912
వాలీబాల్	రమాదేవి	9000992041
క్రికెట్	రాజశేఖర్	9912114789
స్విమ్మింగ్	సంజయ్‌సింగ్	9700882801
టెన్నిస్	మధుసూదనాచారి	9666281961
స్కేటింగ్	యాదయ్య	9346662588
అథ్లెటిక్స్	సాయిబాబారెడ్డి	9703838987
బాస్కెట్‌బాల్	సైదులు	9908801432

అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో శిక్షణ..

విద్యార్థుల పరీక్షలకు అంతరాయం కలగకుండా ఉదయం, సాయంత్రం వేళల్లో శిక్షణ ఇస్తున్నాం. స్టేడియంలో అంతర్జాతీయ క్రీడా పరికరాలు, ప్రమాణాలతో శిక్షణ ఇస్తున్నాం. ఇక్కడ వేలాది మంది విద్యార్థులు, యువత శిక్షణ తీసుకుంటున్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జాతీయ స్థాయి పోటీలు నిర్వహించడం విశేషం.

– వెంకటేశ్వర్‌రావు, డీఎస్‌డీఓ, సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం

క్రీడాకారులకు ప్రయోజనం..



సరూర్‌నగర్ స్టేడియం క్రీడాకారులకు, వాకర్స్‌కు ఎంతో ప్రయోజనంగా ఉంది. ఈ స్టేడియంలో అన్ని రకాల క్రీడలకు నిపుణులైన కోచ్‌లు ఉండడం, జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారులు శిక్షణ పొందుతున్నారు. సరూర్‌నగర్ స్టేడియం జాతీయ పోటీలకు కేంద్రంగా మారడం గర్వంగా ఉంది.

– ఎం.రవికుమార్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థినికి ప్రశంసా పత్రం అందజేస్తున్న వైస్ చైర్మన్ కోహ్లి

ఇబ్రహీంపట్నం రూరల్: చదువుతో పాటు విద్యార్థులకు ఆటలు అవసరమని గురునానక్ విద్యా సంస్థల ఎండీ డాక్టర్ హెచ్ఎస్ సైనీ అన్నారు. ఇబ్రహీంపట్నం సమీపంలోని గురునానక్ విద్యాసంస్థలో ఖేల్ మహోత్సవం–2024ను గురువారం నిర్వహించారు. ఇందులో కబడ్డీ, వాలీబాల్, క్రికెట్ పోటీలో పాటు 100 మీ, 200 మీ, 500 మీ అథ్లెటిక్ పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా హెచ్ఎస్ సైనీ మాట్లాడుతూ.. క్రీడల ద్వారా మానసిక, శారీరక దారుఢ్యం వస్తుందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు క్రీడలు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కోహ్లి, డైరెక్టర్ వెంకటరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ పార్థసారథి, అసోసియేట్ డైరెక్టర్ రిషిసాయల్, హోమియోపతిక్ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రేణుక, డీఆర్ఆర్‌డీ డాక్టర్ రంగనాయకులు, డాక్టర్ సంజీవ్, ఈవెంట్ కోఆర్డినేటర్ డాక్టర్ హరీష్‌కుంద్రాలతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

హోంగార్డుకు ఆర్థిక తోడ్పాటు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న ఓ హోంగార్డుకు అండగా తోటి పోలీసులు నిలిచారు. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ భార్య అనారోగ్యానికి గురైంది. ఈ విషయం తెలుసుకున్న తోటి పోలీసులు దాతృత్వం చాటుకున్నారు. అందరూ కలిసి ఆదుకున్నారు. రూ.56 వేల నగదు పోగుచేసి సీఐ సైదిరెడ్డి, ఎస్ఐలు మారయ్య, నాగరాజు, మైబెల్లి, రామకృష్ణ చేతుల మీదుగా ప్రవీణ్‌కు గురువారం అందజేశారు.



వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు



జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిని జ్ఞాపికతో సన్మానిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు



పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సబితారెడ్డి

మహేశ్వరం: మండల పరిధిలోని నాగుల్‌దోని తండాల్లో ఆంజనేయ స్వామి ధ్వజస్తంభ శిఖర విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ పూజలు గురువారం భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. స్వామివారికి అభిషేకం, హారతి, కుంకుమార్చన, మంత్రపుష్పం, పుష్పలంకరణతో పాటు హోమం నిర్వహించారు. పూజలకు హాజరైన భక్తులకు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. పూజలకు ఎమ్మెల్యే సబితారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు యాదవ్, ఇన్‌చార్జి ఎంపీపీ సునితానాయక్, ఎన్డీ తండా మాజీ సర్పంచ్ ఎం.రాజు నాయక్, బీఆర్ఎస్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు అంగోత్ గోపాల్ నాయక్‌తో పాటు కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంపీ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం



గ్రామ కమిటీల మహిళలతో పామెన జ్యోతి

జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి

షాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయమని జిల్లా మహిళా ఉపాధ్యక్షురాలు పామెన జ్యోతి పేర్కొన్నారు. గురువారం షాబాద్, కేశవగూడ గ్రామాల్లో కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీలను నియమించారు. చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ ఏబ్లాక్ అధ్యక్షురాలు పీసరి అనితారెడ్డి, షాబాద్ మాజీ సర్పంచ్ తమల్లి సుబ్రమణ్వేశ్వరిలతో కలిసి ఎనుకున్నారు. ఈ సందర్భంగా పామెన జ్యోతి మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లోనూ కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని, ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా గెలుపే ధ్యేయంగా ముందుకెళ్లాలన్నారు. చేవెళ్ల నుంచి కచ్చితంగా కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తారని జోస్యం చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుంటే ఓర్వలేకపోతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కట్టిన ప్రాజెక్టులు 40 ఏళ్ల దాటినా చెక్కు చెదరలేదని గుర్తు చేశారు. తెలంగాణ సాధించాక కట్టిన మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో మహిళలు నాగమణి, నాయకులు రవీందర్, రాములు, శివకుమార్, కృష్ణ, శ్రీను, బాల్‌రాజ్ పాల్గొన్నారు.

కేశవగూడ మహిళ గ్రామ కమిటీ..

కేశవగూడ కాంగ్రెస్ మహిళ గ్రామ కమిటీ అధ్యక్షురాలిగా బాలమణి, ఉపాధ్యక్షురాలు భారతమ్మ, ప్రధాన కార్యదర్శిగా సరస్వతి, కార్యదర్శులుగా నందిని, రత్నమ్మ, సహాయ కార్యదర్శులుగా బుచ్చమ్మ, అమృత, జయమ్మలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

షాబాద్ గ్రామ కమిటీ..

షాబాద్ కాంగ్రెస్ మహిళా గ్రామ కమిటీ అధ్యక్షురాలుగా భాగ్యమ్మ, ఉపాధ్యక్షురాలుగా కవిత, కార్యదర్శులుగా రమాదేవి, సుగుణ, సహాయ కార్యదర్శిగా లలితలను ఏకగ్రీవంగా ఎనుకున్నారు.

అభివృద్ధికి అందరూ కలిసి రావాలి

మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి



మీర్‌పేట: కార్పొరేటర్లు, నాయకులతో సమావేశమైన కృష్ణారెడ్డి

మీర్‌పేట: నియోజకవర్గ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా అందరూ కలిసి రావాలని మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి కోరారు. గురువారం టీకేఆర్ కళాశాలలో మీర్‌పేట కార్పొరేషన్‌కు చెందిన పలు పార్టీల నేతలు, కార్పొరేటర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌లోని పలు సమస్యలను తీగల దృష్టికి తెచ్చారు. అనంతరం కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. మన ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించుకుందామని, సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి కార్పొరేషన్ అభివృద్ధికి ప్రత్యేక నిధులు తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందేలా పనిచేయాలన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు వేముల నర్సింహ, రాంచందర్, మల్లేశ్, నరేందర్‌కుమార్, నాయకులు రవినాయక్, ఈశ్వర్‌గౌడ్, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

తీగలపై విమర్శలు తగవు

పహాడీషరీఫ్: మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డిలపై విమర్శలు చేయడం బీఆర్ఎస్ నాయకులకు తగదని జల్‌పల్లి కౌన్సిలర్ బుడుమాల యాదగిరి, మాజీ వార్డు సభ్యుడు దూడల సుధాకర్‌గౌడ్‌లు హితవు పలికారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. జీహెచ్ఎంసీ మేయర్, హుడా చైర్మన్, మహేశ్వరం ఎమ్మెల్యేగా పని చేసిన టీకేఆర్ ఎంతో అభివృద్ధి చేశారన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలో ఆయన ఎమ్మెల్యేగా ఉన్నప్పుడే మంజూరైన నిధులతోనే మాజీ మంత్రి సబితారెడ్డి అభివృద్ధి పనులను పూర్తి చేశారన్నారు. బీఆర్ఎస్‌లో తగిన గుర్తింపు లేని కారణంగానే టీకేఆర్ ఆ పార్టీని వీడారన్నారు. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి కూడా తమ అనుచరులకు లబ్ధి చేకూరేలా చేశారన్నారు. ఇష్టానుసారంగా భూకబ్జాలను ప్రోత్సహించి ప్రభుత్వ భూములు లేకుండా చేశారని ఆరోపించారు. టీకేఆర్ హయాంలో సెంటు భూమి కూడా కబ్జా కాలేదని స్పష్టం చేశారు. మరోసారి విమర్శలకు పాల్పడితే తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. సమావేశంలో సుదర్శన్, నర్సింహ, మోహన్‌గౌడ్, వెంకటేశ్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



పహాడీషరీఫ్: విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి, సుధాకర్‌గౌడ్

యోగా శిబిరం ప్రారంభం



యోగా శిబిరాన్ని ప్రారంభిస్తున్న పారిజాత

బడంగ్‌పేట్: సత్యసాయి సేవా సంస్థ మీర్‌పేట్ వారి సౌజన్యంతో ఆచార్య రమేశ్ గురుజీ ఆధ్వర్యంలో సంస్కార వికాస సాధన, యోగా విజ్ఞాన శిబిరాన్ని బాలాపూర్‌లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్ మేయర్ పారిజాత ముఖ్యులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి సేవలను ప్రారంభించారు. ఈ శిబిరంలో యోగాతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు పాదపూజ కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, నిర్వాహకులు చెన్న కేశవ, గోవర్ధన్‌యాదవ్, మహేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, తదితరులున్నారు.

నాలా పనులు త్వరగా పూర్తి చేయాలి

ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: నాలాల పనులను త్వరగా పూర్తి చేయాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎస్ఎన్‌డీపీ పథకం కింద చేపట్టిన ట్రంక్‌లైన్ పనులు, నాలాలను ఎమ్మెల్యే సబితారెడ్డి పర్యవేక్షించారు. 1వ డివిజన్‌లోని వరలక్ష్మినగర్, సాయిబాలాజీనగర్, సాయికృష్ణ కాలనీల మీదుగా కొనసాగుతున్న ట్రంక్ లైన్ పనులను పరిశీలించారు. వర్షాలు రాకముందే నాలా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ అర్జున్, కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సంరెడ్డి వెంకట్‌రెడ్డి, భీమిడి జంగారెడ్డి, పలు కాలనీవాసులు ఉన్నారు.



నాలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి